ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కరీంనగర్ జిల్లా వార్తలు
5
సోమవారం 5 మే 2025



విద్యార్థులపై కార్పొరేట్ వల

- ఉపాధ్యాయులకు లక్ష్యాల నిర్దేశం
- కరపత్రాలు, బ్రోచర్ల పంపిణీ

కరీంనగర్ టౌన్, మే 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల కోసం ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నాయి. ఉపాధ్యాయులకు లక్ష్యాలను విధించి ప్రవేశాలు ప్రారంభించాయి. ఆ లక్షాలను సాధించేందుకు వారు మండుటెండలో ఇంటింటికీ తిరిగి తల్లిదండ్రులును కలుస్తున్నారు. తమ పాఠశాల ప్రత్యేకతలు, విశిష్టతలను వివరిస్తూ, ఆకర్షణీయమైన బ్రోచర్లు కరపత్రాలను పంచుతున్నారు. పిల్లలను తమ బడిలో చేర్పించాలని కోరుతున్నారు. ప్రతీ ఒక్కరూ 10 నుంచి 20 మందిని పాఠశాలలో చేర్పించాలంటూ ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు ఉపాధ్యాయులకు లక్ష్యాలు విధించాయి. చేర్పించకపోతే విధులు, వేతనాల విషయంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. దీంతో వారు ఉదయం ఏడు గంటల నుంచే ప్రచారాన్ని మొదలు పెడుతున్నారు.ఫ్రీ అడ్మిషన్ల పేరుతో పిల్లలను బడిలో చేర్పించేందుకు యత్నిస్తున్నారు.

● నిబంధనలు బేఖాతరు..

ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలపై విద్యాశాఖ పర్యవేక్షణ కొరవడిందన్న విమర్శలు వస్తున్నాయి. ఫీజుల నియంత్రణకు ప్రభుత్వం జారీ చేసిన జీవోలు అమలు చేయడం లేదు. నిబంధనల ప్రకారం ప్రతీ పాఠశాలలో క్రీడా మైదానం ఉండాలి. అగ్ని ప్రమాదాల నివారణకు అవసరమైన ఏర్పాట్లు ఉండాలి. ఫీజులతో పాటు పుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫాంలు పాఠశాలల్లోనే విక్రయిస్తూ తల్లిదండ్రులనుంచి వేల రూపాయలు వసూలు చేస్తున్నారు.

నేడు పీపీటీ ప్రవేశ పరీక్ష

కరీంనగర్ టౌన్, మే 4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ముకరంపుర ప్రభుత్వ ఉన్నత పాఠశాల(గర్ల్స్) పాఠశాలలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పీపీటీ ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గోల్కొండ శ్రీధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కేఎఫ్ జావేద్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. పీపుల్స్ ప్రోగ్రెసివ్ ట్రస్టు (పీపీటీ) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ప్రగతినగర్‌లో నిర్వహిస్తున్న అనాథ, పాక్షిక అనాథ, నిరుపేద కుటుంబాల పిల్లలకు రెసిడెన్షియల్ విధానంలో ఉచిత విద్య కోసం ఐదో తరగతి నుంచి డిగ్రీ వరకు పాఠశాల నడుపుతున్నారని తెలిపారు. ఈ పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈ పరీక్షను నిర్వహిస్తున్నామని, విద్యార్థులందరు అరగంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

ప్రజావాణి యథాతథం

సుభాష్‌నగర్, మే 4 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని యథాతథంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పమేలాసత్పతి ఒక ప్రకటనలో తెలిపారు. భూభారతి అవగాహన సదస్సుల కారణంగా రెండు వారాలుగా రద్దు చేసి ప్రజావాణి కార్యక్రమాన్ని తిరిగి సోమవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ప్రజలు తమ అర్జీలను సమర్పించవచ్చని అన్నారు.

ఇదేనా ఆత్మగౌరవం?

- బీసీ స్టడీ సర్కిల్‌లో మీల్స్ ఆన్ వీల్స్ ద్వారా ఉచిత భోజనం
- స్టడీసర్కిల్ తరుపున ఇచ్చేది టీ, బిస్కెట్ మాత్రమే
- ప్రభుత్వమే సమకూర్చాలంటున్న అభ్యర్థులు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల సంక్షేమానికి, అభివృద్ధికి పెద్దపీట వేస్తూ వారి ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచి ఆత్మగౌరవంతో బతికేందుకు కృషి చేస్తున్నామని ప్రభుత్వం పదేపదే చెబుతోంది. ఆచరణలో మాత్రం పరిస్థితి అందుకు భిన్నంగా ఉన్నది. సాక్షాత్తూ బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సొంత జిల్లాలో వివిధ పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు తమకు ఆత్మగౌరవం ఎక్కడ ఉందంటూ ప్రశ్నిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కరీంనగర్ ఐటీ పార్కు సమీపంలో బీసీ స్టడీ సర్కిల్‌ను ఏర్పాటు చేసింది. కొన్ని సంవత్సరాలుగా ప్రతి పోటీ పరీక్ష లోనూ మెరుగైన ఫలితాలను సాధిస్తూ వస్తున్నది.



● ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విద్యార్థులు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా బీసీ అభ్యర్థులు వివిధ పరీక్షలకు సిద్ధం కావడానికి బీసీ స్టడీ సర్కిల్‌కు వస్తున్నారు. స్టడీ సర్కిల్‌కు వచ్చేవారికి బయోమెట్రిక్ విధానంలో హాజరు నమోదు చేసుకుని ప్రభుత్వం పక్షాన ఒక బిస్కెట్ ప్యాకెట్, టీ మాత్రమే సమకూర్చేవారు. ఉమ్మడి జిల్లా పరిధిలో వందకుపైగా కిలోమీటర్ల దూరం నుంచి వచ్చి చదువుకుంటున్న వారికి మధ్యాహ్నం పూట భోజనం కోసం ఇబ్బందులు పడుతున్నారు. ఉదయంపూట ఇంటి నుంచి తెచ్చుకోలేక జిల్లా కేంద్రంలో ఒక్కో భోజనానికి 150 రూపాయలు వెచ్చించాల్సిన పరిస్థితి రావడంతో తక్కువ ధరలో లభించే టిఫిన్, ఇతర ఆహార పదార్థాలతో తిని కడుపునింపుకోవాల్సిన పరిస్థితి ఉండేది. దీంతో గత ప్రభుత్వ హయాంలో మంత్రిగా ఉన్న గంగుల కమలాకర్ తన సొంత ఖర్చులతో విద్యార్థులకు స్టడీ సర్కిల్‌లో భోజన వసతి ఏర్పాటు చేశారు. ప్రభుత్వం మారడంతో మళ్లీ పరిస్థితి మొదటికి వచ్చింది.

● కలెక్టర్ చొరవతో లయన్స్ క్లబ్ భోజనం

ప్రస్తుతం 150 మంది విద్యార్థులు వివిధ పోటీ పరీక్షల కోసం ఇక్కడ సిద్ధమవుతున్నారు. వారికి మధ్యాహ్న భోజన సమస్య పునరావృతం కావడంతో ఇటీవల మాజీ కార్పొరేటర్ జంగిలి అయిలేందర్ యాదవ్ కలెక్టర్ పమేలా సత్పతిని కలిసి బీసీ స్టడీ సర్కిల్‌లో పరీక్షలకు సిద్ధమవుతున్నవారికి భోజన వసతి కల్పించాలని విజ్ఞప్తి చేశారు. గతంలో మంత్రి గంగుల కమలాకర్ ఈ సౌకర్యాన్ని కల్పించిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. పరిస్థితిని గమనించిన కలెక్టర్ స్థానికంగా ఉన్న లయన్స్‌క్లబ్ వారిని సంప్రదించి వారి మీల్స్ ఆన్ వీల్స్ కార్యక్రమంలో భాగంగా ఈ విద్యార్థులకు ఉచిత భోజన వసతి కల్పించే ఏర్పాటు చేశారు. బీసీ స్టడీ సర్కిల్‌లోకి జ్యోతిబా పూలే పాఠశాలను షిఫ్టు చేయడంతో ప్రస్తుతం స్టడీ సర్కిల్‌కు విద్యార్థులకు లైబ్రరీ రూం మాత్రమే మిగిలింది. ఈ కేంద్రానికి అధ్యయనం కోసం వచ్చే వారు భోజనం చేయాలంటే ఆరుబయటకు వెళ్లాల్సిందే. మీల్స్ ఆన్ వీల్స్ వాహనం రాగానే విద్యార్థులు దాని వద్దకు వెళ్లి భోజనం పట్టుకుని అక్కడే తిని రావాల్సిన పరిస్థితి ఉన్నది.

● డైనింగ్ హాల్ లేక ఇబ్బందులు

బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల సంక్షేమానికి కోట్లాది రూపాయల బడ్జెట్ కేటాయిస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం స్టడీ సర్కిల్‌కు వచ్చే విద్యార్థుల కోసం మధ్యాహ్న భోజన వసతిని ఏర్పాటు చేయలేని స్థితిలో ఉందా అని ప్రశ్నిస్తున్నారు. దాతలు ఉచితంగా సమకూర్చే భోజనంపై ఆధారపడుతున్నామని, ఆత్మగౌరవం గురించి ఆలోచించే పరిస్థితి ఎక్కడ ఉందంటూ వారు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని స్టడీ సెంటర్లకు హాజరయ్యేవారికి టీ, బిస్కెట్‌తోపాటు మధ్యాహ్న భోజన వసతి కూడా కల్పించాలని కోరుతున్నారు. పుస్తకాలు మాత్రమే సమకూర్చడం కాకుండా నెలలో ఒకటి రెండు రోజులు ముఖ్యమైన సబ్జెక్టులపై క్లాసులు కూడా నిర్వహించాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. కరీంనగర్ స్టడీ సెంటర్‌లో కూర్చుని భోజనం చేసేవిధంగా డైనింగ్‌హాల్‌ను కల్పించాలని, వచ్చే విద్యాసంవత్సరంలోగా ఈ సెంటర్‌లోకి మార్చిన జ్యోతిబాపూలే పాఠశాలను దాని శాశ్వత భవనంలోకి మార్చాలని బీసీ విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్టడీ సెంటర్‌ను సందర్శించి ఇక్కడి పరిస్థితులను పరిశీలించి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా స్టడీ సెంటర్లలో మధ్యాహ్న భోజన వసతి ఏర్పాటు కోసం ముఖ్యమంత్రితో చర్చించి తగిన ఉత్తర్వులు ఇప్పించాలని వారు కోరుతున్నారు.

కేంద్ర కులగణన సర్వే చరిత్రాత్మకం

- కాంగ్రెస్ సర్వేకు, మోదీ సర్వేకు పొంతన లేదు
- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

కరీంనగర్, మే 4 (ఆంధ్రజ్యోతి, ప్రతినిధి): కేంద్రంలోని మోదీ ప్రభుత్వం చేస్తున్న కులగణన సర్వే చరిత్రాత్మకమని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం కొత్తపల్లిలో హనుమాన్ విగ్రహ ప్రారంభోత్సవం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర కులగణన నిర్ణయం కాంగ్రెస్ విజయమని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ కులగణన సర్వేకు మోదీ కులగణనకు పొంతనే లేదన్నారు. కాంగ్రెస్ కులగణనతో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. బీసీల జనాభాను తగ్గించి చూపారాన్నారు. కాంగ్రెస్ మాయ మాటలను జనం నమ్మడం లేదన్నారు. 52 శాతం జనాభా ఉన్న బీసీలను 46 శాతంగా చూపారన్నారు. 42 శాతం రిజర్వేషన్లు బీసీలకు అమలు చేస్తున్నామని చెప్పి అందులో పది శాతం రిజర్వేషన్లను ముస్లింలకు కేటాయించారన్నారు. నిజానికి కాంగ్రెస్ బీసీలకు 32 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తానంటుందన్నారు. ఇప్పటికే మోదీ ప్రభుత్వం 27 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తోందన్నారు. ఆరు గ్యారెంటీల అమలులో వైఫల్యాన్ని పక్కదోవ పట్టించేందుకు కాంగ్రెస్ డ్రామాలాడుతోందని విమర్శించారు. నిషేధిత మావోయిస్టు సంస్థతో చర్చల


కొత్తపల్లిలో విలేకరులతో మాట్లాడుతున్న కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

ప్రసక్తే లేదని, వాళ్లు తుపాకీ వీడాల్సిందే, పోలీసులకు లొంగిపోవాల్సిందేనని స్పష్టం చేశారు. మావోయిస్టుల సమస్యను సామాజిక కోణంతో చూడాలంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కగార్ ఆపాలంటూ కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై ఆయన తీవ్రంగా స్పందించారు. మందుపాతరలు పెట్టి పోలీసులు, రాజకీయ నాయకులను చంపుతుంటే సామాజిక కోణంలో చూడాలా అని ప్రశ్నించారు. మావోయిస్టులపై నిషేధం విధించిందే కాంగ్రెస్ పాలకులు అన్నారు. రాష్ట్రంలో మావోయిస్టులపై విధించిన నిషేధాన్ని ఎత్తివేసే దమ్ము కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉందా అని సవాల్ విసిరారు. మావోయిస్టులు తుపాకులు చేతిలో పట్టుకుని అమాయకులైన గిరిజనులు, పోలీసులను కాల్చి చంపుతున్నారన్నారు. మహాముత్తారంలో ఎస్‌ఐ భార్య సీమంతం చేసుకునే సమయంలో బాంబులు పెట్టి నక్సల్స్ ఆ ఎస్‌ఐని, కానిస్టేబుల్‌ను చంపేశారన్నారు. దూరదర్శన్ జర్నలిస్టును చంపేశారు. బీజేపీ నాయకులు సామ జగన్మోహన్‌రెడ్డి, మధుసూదన్‌గౌడ్, రామన్న, గోపన్నలను చంపేశారన్నారు. కాంగ్రెస్ నాయకుడు అజాత శత్రువు శ్రీపాదరావును చంపేశారన్నారు. కేసీఆర్ టీడీపీలో ఉండగా ఎంతో మంది నాయకులను చంపేశారన్నారు. పాకిస్తాన్ పౌరులను తిరిగే పంపే అంశంపై కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే అన్ని రాష్ట్రాలకు ఆదేశాలిచ్చిందని, దేశమంతా సీరియస్‌గా చర్యలు తీసుకుంటున్నారన్నారు. తెలంగాణ ప్రభుత్వం మాత్రం నామ మాత్రంగా చర్యలు తీసుకోవడం సరికాదన్నారు. ఇప్పటికీ చాలా మంది పాస్‌పోర్టు వీసాల్లేకుండా ఇక్కడ నివసిస్తున్నట్లు సమాచారముంద న్నారు. కాళేశ్వరంపై ఎన్‌డీఎస్‌ఏ నివేదిక వచ్చి వారం రోజులైందని, చర్యలు ఎందుకు తీసుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో మాజీ మేయర్ సునీల్‌రావు, కొత్తపల్లి మాజీ ఛైర్మన్ రుద్ర రాజు, మాజీ ఎంపీపీ వాసాల రమేష్, స్వర్గం నర్సయ్య, చంద్రశేఖర్, కెంచ శేఖర్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా నీట్

- ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులకు అనుమతి నిరాకరణ



7

జోరుగా.. హుషారుగా స్విమ్ చేద్దామా

7

నేటి నుంచి భూభారతి రెవెన్యూ సదస్సులు

కరీంనగర్, మే 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి చట్టం అమలులో భాగంగా సోమవారం నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు కలెక్టర్ పమేలా సత్పతి ఓ ప్రకటనలో తెలి పారు. పైలట్ ప్రాజెక్టు కింద సైదాపూర్ మండలాన్ని ఎంపిక చేశామన్నారు. సదస్సుల నిర్వహణకు రెండు రెవెన్యూ బృందాలను నియమిం చామన్నారు. ఆయా గ్రామాల్లో సంబంధిత సమస్యలపై రైతులు, ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తారన్నారు. ప్రతి రోజు ఒక్కో బృందం ఒక గ్రామం చొప్పున రోజుకు రెండు గ్రామా ల్లో సదస్సులు నిర్వహించేలా ప్రణాళికలు రూపొందించామ న్నారు. ఈ నెల 5, 6న గొడిశాల, ఆకునూరు గ్రామాల్లో, 7, 8వతేదీన రాయికల్,ఎక్లాస్ పూర్ గ్రామాల్లో, 9న రామచంద్రా పురం, వెంకేపల్లి గ్రామాల్లో 12, 13 తేదీల్లో దుద్దునపల్లి, బొమ్మకల్ గ్రామాల్లో 14, 15 తేదీల్లో సోమారం, ఎలబోతారం గ్రామాల్లో, 16, 17 తేదీన సైదాపూర్, వెన్నంపల్లి గ్రామాల్లో, 19, 20 తేదీల్లో అమ్మన గుర్తి, ఘన్పూర్ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఎడాపెడా విద్యుత్ కోతలు

- నిత్యం మరమ్మతులు, చెట్లకొమ్మల తొలగింపుల పేరుతో కరెంట్ కట్
- సరఫరాలో గంటలపాటు అంతరాయం
- ఇబ్బందులు పడుతున్న నగరవాసులు

గణేశ్‌నగర్, మే 4 (ఆంధ్రజ్యోతి): కరెంట్ కోతలతో జనం అవస్థలు పడుతున్నారు. గంటల తరబడి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుండడంతో జనాలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. అసలే వేసవి కరెంట్ లేక ఉక్కపోతతో ఉక్కి రిబిక్కిరి అవుతున్నారు. చిన్నపాటి గాలివాన వచ్చినా విద్యుత్ సరఫ రాలో తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. చిన్న సమస్య ఎదురైనా గంట నుంచి రెండు గంటల వరకు వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నారు. దీంతో నగరవాసులు ఇబ్బందులు పడుతు న్నారు. దీనిని అధికారులు గుర్తించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. వారంలో ఒకటి రెండు రోజులు మరమ్మ తులు చేస్తే బాగుంటుందికాని ప్రతి రోజు మర్మతులు అంటూ విద్యుత్ కోతలువిధిస్తుండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని నగరవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సమస్యలు పరిష్కరిస్తున్నాం

మేక రమేష్ బాబు,
ఎస్ఈ, టీజీ ఎన్పీడీసీఎల్



ఎక్కడ సమస్య వచ్చినా తక్షణమే పరిష్కరిస్తున్నాం. గాలివాన వస్తే సమస్య వస్తుంది. అక్కడక్కడ చెట్లకొమ్మలతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొమ్మలు నరికి విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తున్నాం. నిర్వహణ పనులు చేసేప్పుడు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ప్రతికల ద్వారా తెలియజేస్తున్నాం.





పట్టుబట్టి సాధించారు..

జూనియర్ సివిల్ జడ్జిలుగా ఉమ్మడి జిల్లా యువత

వారు కష్టాలు ఎదురైనా అధిగమించి అనుకున్న లక్ష్యాన్ని సాధించారు. కష్టపడి చదివి న్యాయమూర్తులుగా ఎదిగారు. చిన్న వయస్సులోనే జూనియర్ సివిల్ జడ్జిలుగా ఎదిగి యువతకు ఆదర్శంగా నిలిచారు. ఉమ్మడి జిల్లాలో జూనియర్ సివిల్ జడ్జిలుగా ఎంపికైన వారి గురించి 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

వైకల్యాన్ని జయించి..

సిరిసిల్ల క్రైం, మే 4 (ఆంధ్రజ్యోతి): పుట్టినప్పటి నుంచే ఉన్న వైకల్యాన్ని జయించి.. న్యాయమూర్తిగా నిలిచిందామె... అమ్మ, నాన్నల ప్రోత్సాహంతో జూనియర్ సివిల్ జడ్జిగా జాహ్నవి ఎంపికైంది. ఇటీవల విడుదలైన తెలంగాణ రాష్ట్ర జ్యుడిషియల్ సర్వీసెస్ పరీక్ష ఫలితాల్లో 29 ఏళ్ల వయస్సులోనే జాహ్నవి ప్రతిభ కనబరిచి అనుకున్న లక్ష్యాన్ని చేరింది. చిన్నప్పటి నుంచే న్యాయమూర్తి కావాలనే కోరిక ఎట్టకేలకు నెరవేరింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ పట్టణం భీమేశ్వరాలయం వీధికి చెందిన సంకెపల్లి సుమనారాణి, హరికిషన్‌లకు ఇద్దరు సంతానం. కొడుకు వరుణ్‌కుమార్, కూతురు జాహ్నవి. హరికిషన్ వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్. వరుణ్‌కుమార్ ఎంబీఏ చదివి ఉద్యోగం చేస్తున్నాడు. జాహ్నవి చిన్నప్పటి నుంచే వైకల్యం ఉండడంతో పక్కన ఉండే దేవయ్య బడికి వెళ్లి 3వ తరగతి వరకు చదివింది. ఆ తర్వాత వేములవాడ పట్టణంలోని జవహర్‌లాల్ నెహ్రూ విద్యాసంస్థల్లో బీకాం చదివింది. జ్యుడిషియల్ ఆఫీసర్ కావాలనే కోరికతో ఆంధ్రమహిళా సభలో ఎల్ఎల్‌బీ పూర్తిచేసింది. 2019లో బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా నమోదు చేసుకుని వేములవాడ బార్ అసోసియేషన్‌లో సభ్యురాలిగా చేరింది. తర్వాత పట్టుదలతో పీజీఎల్‌సెట్‌లో ర్యాంకు సాధించి ఉస్మానియా యూనివర్సిటీలో ఎల్ఎల్ఎం క్యాంపస్ సీటు పొంది లేబర్ లా పూర్తిచేసింది. ఆ తర్వాత జేఆర్ఎఫ్ రాసి ర్యాంకు సాధించి ఉస్మానియా యూనివర్సిటీలో లేబర్‌లాలో పీహెచ్‌డీ చేసింది. యూనివర్సిటీలో చదవు కొనసాగిస్తూనే నాలుగేళ్లుగా జ్యుడిషియల్ (జేసీజే) పరీక్ష రాస్తోంది. జూనియర్ సివిల్ జడ్జి పరీక్ష కోసం ఇంటి వద్దనే రోజుకు 10 గంటలు చదివి 2020లో ప్రిలిమినరీ పరీక్షకు మొదటిసారి హాజరైంది. తర్వాత పట్టుదలతో చదివి నాలుగో ప్రయత్నంలో 2024 జూన్‌లో ప్రిలిమ్స్ అర్హత సాధించింది. నవంబర్‌లో మెయిన్స్ రాసి మెరిట్ సాధించి 2025 ఏప్రిల్‌లో జరిగిన ఇంటర్వ్యూను విజయవంతంగా పూర్తిచేసి జూనియర్ సివిల్ జడ్జి పోస్టుకు ఎంపికైంది.



జాహ్నవి

● అమ్మ, నాన్నల ప్రోతాహం ఎంతో ఉంది..

- సంకెపల్లి జాహ్నవి

ఇంటర్ తర్వాత లా చదివి జడ్జి కావాలని కోరిక. బీకాం డిగ్రీ పూర్తయ్యాక లా చదివాను. ఇందుకు అమ్మ సుమనారాణి, నాన్న హరికిషన్, అన్నయ్య వరుణ్‌కుమార్ ప్రోత్సాహం ఎంతో ఉంది. నేను ఏ పోటీ పరీక్ష రాయాలన్నా నాకున్న వైకల్యం కారణంగా అమ్మ, నాన్నలు వెంట వచ్చేవారు. ఎన్ని ఇబ్బందులు ఉన్నా రోజుకు 10గంటలు చదివేదాన్ని. చివరికి జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపిక కావడంతో నా కల నెరవేరింది.

పేదింట వికసించిన విద్యాకుసుమం

జగిత్యాల రూరల్, మే 4 (ఆంధ్రజ్యోతి): నిరు పేద కుటుంబం నుంచి వచ్చి ఖర్చుల కోసం పార్ట్ టైం జాబ్ చేస్తూ కష్టపడి చదివి జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యాడు పట్నం నరేష్(26). జగిత్యాల మండలం హస్నాబాద్ గ్రామానికి చెందిన కనకయ్య, యాదవ్వ దంపతులది నిరుపేద కుటుంబం. వీరికి ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు. గ్రామంలో అద్దెకు ఉంటూ పొట్టకూటి కోసం నరేష్ తండ్రి కనకయ్య హమాలీగా పనిచేస్తుండగా తల్లి యాదవ్వ కూలి పని చేస్తున్నారు. తాజాగా వెలువడిన ఫలితాల్లో నరేష్ జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యాడు. 2024లో నరేష్ హైదరాబాద్‌లో ఎల్ఎల్ఎం పూర్తి చేసి ఓ లాయర్ వద్ద పార్ట్ టైం జాబ్ చేస్తూ జూనియర్ సివిల్ జడ్జి పరీక్ష కోసం ప్రిపేర్ అయ్యాడు. ఎట్టకేలకు అనుకున్నది సాధించడంతో నరేష్ ఆనం దానికి అవధులు లేకుండా పోయింది. కొడుకు ఉద్యోగం సాధించడంతో తమ కుటుంబ కష్టాలు తీరినట్టేనని నరేష్ తల్లితండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



పట్నం నరేష్

కష్టాలను అధిగమించి..

హుజూరాబాద్, మే 4 (ఆంధ్రజ్యోతి): ఆమెది చేనేత కార్మికురాలి కుటుంబం.. తండ్రి అనారోగ్యంతో నాలుగేళ్ల క్రితం మృతి చెందాడు... తల్లి చేనేత కూలీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది... కష్టపడి చదివి తాజాగా వెలువడ్డ ఫలితాల్లో జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికై యువతకు స్ఫూర్తినిచ్చింది. హుజూరాబాద్ మండలం తుమ్మనపల్లి గ్రామా నికి చెందిన బత్తుల మల్లేశం- నర్మదలకు ముగ్గురు సంతానం. అందులో చిన్నకూతురైన మా నస చిన్నప్పటి నుంచే చదువు మీద ఆసక్తి ఉండేది. ఆర్థిక పరిస్థితి సరిగా లేకపోవడంతో పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన మానస మేనత్త ఉమాదేవి-మనోజ్‌లు ఆమెను చదివించారు. మానస చదువుకోవడానికి ఆర్థికంగా సహాయ పడ్డారు. మానస ఎల్కతుర్తి మండలంలోని సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో పదో తరగతి వరకు, ఇంటర్, డిగ్రీ హుజూరాబాద్‌లో చదువుకుంది. హనుమకొండలోని కాకతీయ యూనివర్సి టీలో ఎంఏ సోషియాలజీ, ఎల్ఎల్‌బీ పూర్తి చేసింది. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం జూనియర్ సివిల్ జడ్జి ఉద్యోగ ప్రకటన చేయగా ప్రిలిమ్స్, మెయిన్స్‌లో ఉత్తమ ఫలితం సాధించి ఇంటర్వ్యూకు అర్హత సాధించింది. ఇంటర్వ్యూను విజయవంతంగా పూర్తిగా చేసి జూనియర్ సివిల్ జడ్జిగా మానస ఎంపికైంది.



బత్తుల మానస

కోతుల దాడిలో మహిళకు తీవ్రగాయాలు

హుజూరాబాద్, మే 4 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన పుల్లూరి త్రివేణి అనే మహిళ కోతులదాడిలో ఆదివారం తీవ్రంగా గాయపడింది. కోతులు ఒక్కసారిగా ఆమెను కరవడంతో కాలుకు తీవ్రగాయమైంది. దీంతో స్థానికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. వెంటనే మహిళను ఆస్పత్రికి తరలించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

గంగాధర, మే 4 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం ఉప్పరమల్యాలో పేకాటరాయుళ్లను పట్టుకున్నట్లు ఇన్‌చార్జి ఎస్సై స్వాతి తెలిపారు. ఆమె తిలిపిన వివరాల ప్రకారం.. ఉప్పరమల్యాల శివారులో పేకాడుతున్నారన్న పక్కాసమాచారం మేరకు దాడులు చేశామన్నారు. ఈ దాడిలో నలుగురు జూదమాడుతూ పట్టుబడినట్లు తెలిపారు. వారివద్ద రూ.2820 లభించాయని తెలిపారు. వారిపై కేసునమోదు చేసి కోర్టులో హాజరుపరచనున్నట్లు ఆమె తెలిపారు.

అక్రమ మద్యం పట్టివేత

గంగాధర, మే 4 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలంలో బెల్టుషాపుల్లో ఉన్న అక్రమమద్యంను ఆదివారం పట్టుకున్నట్లు ఇన్‌చార్జి ఎస్సై స్వాతి తెలిపారు. ఆమె వివరాల ప్రకారం.. గంగాధర గ్రామంలో 4బెల్టుషాపులు, హిమ్మత్ నగర్‌లో ఒక్క బెల్టుషాపుల్లో తనిఖీచేయగా 86లీటర్ల అక్రమ మద్యం లభించినట్లు తెలిపారు. అక్రమంగా మద్యం అమ్ముతున్న బెల్టుషాపు నిర్వహకులపై కేసు నమోదు చేసినట్లు ఆమె తెలిపారు.

కూలిన వడ్ల లోడ్.. తప్పిన ప్రమాదం

శంకరపట్నం, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేశవపట్నం బస్టాండ్ సమీపంలో వడ్లలోడ్ ట్రాక్టర్‌నుంచి బస్తాలు రోడ్డుపై పడిపోయాయి. హుజూరాబాద్ మండలం కందుగుల గ్రామం నుంచి మానకొండూర్ మండలంలోని ఓసీడ్ ప్లాంట్‌లోకి రైతు వడ్లను ట్రాక్టర్‌లో లోడ్ చేసుకొని తీసుకెళ్తున్నాడు. ఈ క్రమంలో కేశవపట్నం బస్టాండ్ సమీపంలో స్పీడ్‌బ్రేకర్లు దాటుతుండగా ఒక్కసారిగా ట్రాక్టర్ నుంచి వడ్లబస్తాలు రోడ్డుపై పడిపోయాయి. ఆ సమయంలో రోడ్డు పక్కన ప్రయాణికులు లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

ఎల్లారెడ్డిపేట, మే 4 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం బాకురు పల్లి తండాకుచెందిన రమావత్ బాల్య(71) ఈనెల3న రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మృతిచెందాడని పోలీసులు ఆదివారం తెలిపారు. గ్రామంలోని వృద్ధుడు బాల్య పింఛన్ డబ్బులు తీసుకునేందుకు మండలంలోని రాచర్ల గొల్లపల్లికి వచ్చాడని పేర్కొన్నారు. రోడ్డు దాటుతున్న గ్రామంలో వాహనం ఢీకొట్టడంతో తీవ్రగాయాల పాలయ్యాడన్నారు. మొదట సిరిసిల్లలోని ఆసుపత్రికి తరలించి, మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తీసుకువెళ్లారని తెలిపారు. చివరికి పరిస్థితి విషమించి వృద్ధుడు బాల్య మృతి చెందాడన్నారు. మృతుడికి ఇద్దరు కొడుకులు లాల్‌సింగ్, మోహన్, వివాహమైన ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీ సులు వివరించారు.

చింతచెట్టుపై నుంచి పడి చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి

వీణవంక, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చల్లూరు గ్రామానికి చెందిన పెద్ది ఆదిరెడ్డి(75) చింతచెట్టు పైనుంచి పడి చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. పోలీసులు వివరాల ప్రకారం.. శనివారం ఆదిరెడ్డి చింతచెట్టు ఎక్కి చింతకాయలు దులుపుతున్నాడు. ప్రమాదవశాత్తు కాలుజారిపడగా గాయాలయ్యాయి. వెంటనే అతన్ని కుటుంబసభ్యులు కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ఆదిరెడ్డి చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి మేనల్లుడు బండ భూపతిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పాముకాటుతో ఒకరి మృతి

బీర్‌పూర్, మే 4 (ఆంధ్రజ్యోతి): పాముకాటుకు గురై చికిత్స పొందుతూ ఆదివారం గణపతిదేవ్‌రావ్ టార్పే(34) అనే వ్యక్తి మృతి చెందినట్లు బీర్ పూర్ ట్రైనీఎస్సై రాజు తెలిపారు. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా నంద గావ్ గ్రామానికి చెందిన గణపతిదేవ్‌రావ్ టార్పే తన స్నేహితుడైన సూర్యభాను మారుతితో కలిసి పీతలను పట్టడానికి శనివారం రాత్రి రోళ్లవాగు ప్రాజెక్టుకు వచ్చాడు. ఆ సమయంలో పాముకాటుకు గురై 100 నంబర్‌కు డయల్ చేశాడు. దీంతో బీర్‌పూర్ పోలీసులు వెంటనే స్పందించి బాధితుడిని అటవీప్రాంతం నుంచి తీసుకువచ్చి అంబులెన్స్ ద్వారా జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించి గణపతిదేవ్ రావ్ టార్పే ఆదివారం మధ్యాహ్నం చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య పుష్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ట్రైనీ ఎస్సై తెలిపారు.

ట్రాఫిక్ పోలీసుల చొరవ

● ఆటోలో డబ్బులు పోగొట్టుకున్న ప్రయాణికురాలికి తిరిగి అప్పగింత

కోల్‌సిటీ, మే 4 (ఆంధ్రజ్యోతి): ఆటోలో క్యాష్ బ్యాగ్ మరిచిపోయిన ప్రయాణికురాలికి బ్యాగు అప్పగించి తన బాధ్యతను చాటుకున్నారు రామగుండం పోలీసులు. గోదావరిఖని పవర్‌హౌస్‌కాలనీకి చెందిన పెసరి సునీత ఆదివారం రామగుండం రైల్వేస్టేషన్ నుంచి గోదావరిఖని బస్టాండ్ వరకు ప్రయాణించింది. రూ.30వేలు నగదుతో కూడిన క్యాష్ బ్యాగ్‌ను ఆటోలు మరిచిపోయింది. విషయాన్ని పక్కనే ఉన్న ట్రాఫిక్ పోలీసులకు తెలుపడంతో సీఐ రాజేశ్వర్‌రావు బస్టాండ్ వద్ద ఉన్న సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలించి ఆటో నంబర్‌ను గుర్తించారు. సమాచారాన్ని ఆటోల నిర్వాహకులకు తెలిజేయగా వారు సదరు ఆటో డ్రైవర్‌కు విషయం చెప్పడంతో అతడు ఆటోలో చూడగా క్యాష్ బ్యాగ్ అగుపించింది. రూ.30వేలు నగదుతో కూడిన క్యాష్ బ్యాగును తిరిగి ప్రయాణీకురాలు పెసరి సునీతకు సీఐ రాజేశ్వర్‌రావు అప్పగించారు.



ప్రయాణికురాలు సునీతకు బ్యాగు అందజేస్తున్న సీఐ రాజేశ్వర్‌రావు

ప్రాణం తీసిన ఆన్‌లైన్ బెట్టింగ్

● సెంటినరీకాలనీలో ఉరివేసుకొని యువకుడి ఆత్మహత్య

రామగిరి, మే 4 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లిజిల్లా రామగిరి మండలంలోని సెంటినరీకాలనీలో వేముల వసంత్(27)అనే యువకుడు ఉరి వేసుకుని ఆదివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వసంత్ ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని ఓసిపి-2లో సీ-5 ప్రైవేట్ ఓబీ కంపెనీలో వోల్వో ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఆన్‌లైన్‌లో గేమ్స్‌లో పాల్గొని డబ్బులు కోల్పోయిన వసంత్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో క్వార్టర్‌లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బెట్టింగ్‌లో పాల్గొని వసంత్ నాలుగు లక్షల మేరకు అప్పుల పాలయ్యాడు. ఈ విషయం తండ్రి రవిశంకర్‌కు తెలియడంతో కుమారుడిని మందలించి గతేడాది డిసెంబర్‌లో పూర్తిగా అప్పు చెల్లించాడు. ఆన్‌లైన్ బెట్టింగ్‌కు బానిసైన వసంత్ తిరిగి అదే వ్యవహారం కొనసాగించినట్లు తెలిసింది. ఆదివారం ఉదయం సుల్తానాబాద్‌లో ఓ ఫంక్షన్‌కు తల్లిదండ్రులు వెళ్లారు. అప్పువిషయం వారికి తెలిస్తే మందలిస్తారనే భయంతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



వసంత్ (ఫైల్)

విద్యుత్ తీగలు తెగిపడి అగ్నిప్రమాదం

● పలు వాహనాలు, 25 క్వింటాళ్ల మొక్కజొన్న దగ్ధం ● రూ.8 లక్షల నష్టం

గొల్లపల్లి, మే 4 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల సమీపంలో ఆదివారం గాలి దుమారానికి విద్యుత్ తీగలు తెగిపడి ఆదివారం అగ్నిప్రమాదం జరిగింది. టాటాఏస్, స్కూటీ వాహనాలు ఆరుబయట ఆరబెట్టిన 25 క్వింటాళ్ల మొక్కజొన్న పంటపూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. దీంతో కాలనీ వాసులు తీవ్రభయాందోళనకు గురై విద్యుత్ అధికారులకు సమాచామందించారు. వెంటనే విద్యుత్‌అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతో కాలనీవాసులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఈ అగ్ని ప్రమాదంలో సుమారు రూ.8 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు.



దగ్ధమైన టాటా ఏస్ వ్యాన్



సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

భగత్‌నగర్, మే 4(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లాకార్యదర్శి ఎడ్ల రమేష్ పిలుపునిచ్చారు. ఆదివారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెపోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 20వ తేదీన దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెకు జాతీయ కార్మికసంఘాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగసంఘాలు స్వతంత్ర్య ఫెడరేషన్లు పిలుపు నిచ్చాయన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు గీట్ల ముకుందరెడ్డి, నగర కార్యదర్శి పుల్లెల మల్లయ్య పాల్గొన్నారు.న్నరు.

ఈదురు గాలులు.. వర్షం

● విరిగిపడిన చెట్లు
● తడిసిన ధాన్యం



చిన్నముల్కనూర్‌లో నేల కొరిగిన చెట్లను తొలగిస్తున్న ఎస్సై జగదీష్



తిమ్మాపూర్‌లో తడిసిన ధాన్యం



మృత్యువాత పడిన ఆవు వద్ద రోదిస్తున్న రైతు రాజు

హుజూరాబాద్/శంకరపట్నం/జమ్మికుంట రూరల్/చిగురుమామిడి/తిమ్మాపూర్, మే 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలుమండలాల్లో ఆదివారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన చిరుజల్లులు కురిసాయి. ఎండలకు ఉక్కిరి బిక్కిరి అవుతున్నప్రజలకు ఒక్కసారిగా వాతావరణం చల్లబడటంతో ఆరుబయటకు వచ్చి సేదతీరారు. కొనుగోలు కేంద్రాలు, రోడ్లపై ఆరబోసిన రైతులు తమ ధాన్యాన్ని అంతా ఒక దగ్గరికి కుప్పచేసుకొని టార్పాలిన్లు కప్పారు. సుమారు 2గంటలపాటు విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. చిగురుమామిడి మండలం చిన్నముల్కనూర్, చిగురుమామిడి తదితర గ్రామాల్లో విద్యుత్‌స్తంభాలు విరిగిరోడ్లకు అడ్డంగాపడ్డాయి. రోడ్లకు ఇరువైపులా ఉన్న చెట్లు విరిగిపోయాయి. ఇన్‌చార్జి ఎస్సై జగదీష్ అధ్వర్యంలోచెట్లను, విద్యుత్‌స్తంభాలను తొలగించారు. ఇందుర్తి గ్రామంలో అందె రాములు ఇల్లు కూలిపోయింది. గునుకులపల్లిలో మామిడిచెట్లు కూలిపోయాయి. తోటల్లో చెట్లకు ఉన్న కాయలు రాలిపోయాయి. ఇదే గ్రామంలో కొనుగోలు కేంద్రంలో పోసిన ధాన్యం పూర్తిగా తడిసి ముద్దవగా రైతు భద్రాచలం రోదిస్తూ ప్రభుత్వం తనను ఆదుకోవాలని ఆవేదన వ్యక్తం చేశాడు.

బీర్‌పూర్‌లో వడగళ్ల వాన

బీర్‌పూర్: జగిత్యాలజిల్లా బీర్‌పూర్ మండలంలోని పలుగ్రామాలలో ఆదివారం రాత్రి ఈదురు గాలులతోకూడిన వడగళ్ల వాన కురిసింది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసింది. పలు గ్రామాల్లో మామిడి కాయలు నేలరాలాయి. బీర్‌పూర్ మండలకేంద్రంలో ఈదురుగాలులకు పోలీస్ స్టేషన్ ఎదుటచెట్టు విరిగిపోవడంతో రాకపోకలకుఅంతరాయం కలిగింది. విద్యుత్‌స్తంభం విరిగిపడిపోగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

పిడుగుపాటుతో ఆవు మృతి

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండలం బుగ్గరాజేశ్వరతండాలో పిడుగుపాటుకు రైతు బానోతు రాజుకు చెందిన ఆవు ఆదివారం మృత్యువాత పడింది. రాజు తన వ్యవసాయ పొలం వద్ద ఆవును కట్టేశాడు. సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన గాలి వీచి ఒక్కసారిగా పిడుగు పడడం వల్ల ఆవు మృతిచెందింది. ఆ ప్రాంతమంతా కాలిపోయింది. విషయం తెలుసుకున్న రైతు రాజు కుటుంబ సభ్యులు అక్కడకు చేరుకుని రోదించారు. ఆవు విలువ సుమారు రూ.50 వేలు ఉంటుందని బాధిత రైతు రాజు తెలిపారు. కాగా రైతును ప్రభుత్వం ఆదుకోవాలని తాజా, మాజీ సర్పంచ్ రజిత-తిరుపతినాయక్ కోరారు.

● సారంపల్లిలో గేదె మృతి..

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండలం సారంపల్లి గ్రామంలో రాముల లింగయ్య అనే రైతుకు చెందిన గేదె పిడుగుపాటుకు మృతి చెందింది. సుమారు రూ.లక్షనష్టం వాటిల్లిందని రైతు రాముల లింగయ్య ఆవేదన వ్యక్తం చేశాడు.

ఏటీఎంలో చోరీకి యత్నం

కరీంనగర్ క్రైం, మే 4 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ క్రిస్టియన్ కాలనీలోని ఎస్‌బీఐకి చెందిన ఏటీఎంలో చోరీకి యత్నించినట్లు బ్యాంక్ ఏటీఎంచానల్ ఎగ్జిక్యూటీవ్ రజనీకాంత్ కరీంనగర్ రెండోఠాణా పోలీసులకు ఫిర్యాదుచేశాడు. పోలీసుల వివరాల ప్రకారం.. క్రిస్టియన్‌కాలనీలోని ఏటీఎంలో ఆదివారం ఉదయం 4:25నిమిషాలకు ఇద్దరు వ్యక్తులు ఏటీఎం ఫ్రంట్‌డోర్ తెరిచి క్యాష్ బయటకు వచ్చేమార్గంలో టేప్ అడ్డుపెట్టారని ముంబాయినుంచి సీసీటీవీ మానిటరింగ్ టీం గుర్తించింది. ఏటీఎం చానల్ ఎగ్జిక్యూటీవ్ రజనీకాంత్‌కు ఉదయం 5:38 గంటలకు ఫోన్‌చేసి అప్రమత్తం చేసింది. ఏటీఎంకు వెళ్లిపరిశీలించగా ప్లాస్టర్ అంటించినట్లు ఉంది. రజనీకాంత్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

వీణవంక, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో మానేరు వాగునుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకరవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఇసుకరవాణా చేస్తున్న పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ట్రాక్టర్ ఓనర్‌డ్రైవర్లు రాపర్తి సతీష్, రాపర్తి శ్రీనివాస్‌పై కేసునమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గన్నేరువరం: తిమ్మాపూర్ మండలం రేణిగుంట నుంచి గుండ్లపల్లికి ఆదివారం అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ట్రైనీ ఎస్సై అరుణ్ తెలిపారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

● నేడు ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవం

సుభాష్‌నగర్, మే 4 (ఆంధ్రజ్యోతి): పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉండవచ్చనేది అందరికీ తెలిసిన విషయం. అందులో చేతులు పరిశుభ్రంగా ఉంటేనే మిగతా విషయాల్లోనూ శుభ్రత పాటించవచ్చు. ప్రతి సంవత్సరం మే 5న ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవాన్ని నిర్వహిస్తున్నది. మన చేతులు రోజంతా లెక్కలేనన్ని వస్తువులు, పరికరాలు తాకుతుంటాయి. చేతులపై క్రిములు పేరు కుపోతాయి. ఇవి ఇన్‌ఫెక్షన్లకు దారి తీస్తాయి. ఈ ఇన్‌ఫెక్షన్లు ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయి.



● చేతులు ఇలా శుభ్రం చేసుకోవాలి

ప్రజారోగ్యానికి చేతుల పరిశుభ్రత ఒక మూలస్తంభం. సబ్బు, నీటితో సరైన చేతులు కడుక్కోవడం లేదా ఆల్కహాలు ఆధారిత హ్యాండ్ శానిటైజర్లను ఉపయోగించడం వల్ల చేతుల నుంచి క్రిములు, బ్యాక్టీరియా, వైరస్‌లను సమర్థవంతంగా తొలగించవచ్చని డాక్టర్లు చెబుతున్నారు. ఇంట్లో, పాఠశాలల్లో, కార్యాలయాలల్లో ఎక్కడైనా క్రమం తప్పకుండా చేతులు కడుక్కోవడం వల్ల ఫ్లూ, జలుబు, జీర్ణశయాంతర ఇన్‌ఫెక్షన్లు వంటి సాధారణ అనారోగ్యాల వ్యాప్తిని నిరోధించవచ్చు. చేతులను తరుచుగా కనీసం 20 సెకన్లపాటు సబ్బు, నీటితో కడుక్కోవాలి. ముఖ్యంగా తినడానికి ముందు, రెస్ట్‌రూమును ఉపయోగించిన తరువాత, ముక్కు చీదిన తరువాత, దగ్గిన, తుమ్మిన తరువాత, జంతువులు, వాటి వ్యర్థాలను తాకినా తరువాత సబ్బు నీరు లేదా హ్యాండ్ శానిటైజర్‌ను ఉపయోగించి చేతులను శుభ్రం చేసుకోవాలి.

కొవిడ్ తర్వాత ప్రజల్లో అవగాహన పెరిగింది..

- డాక్టర్ రఘురామన్, సీనియర్ ఫిజీషియన్

ఆరోగ్య పరిరక్షణలో చేతుల పరిశుభ్రత కీలకం. కొవిడ్ తర్వాత ఈ విషయంపై ప్రజల్లో అవగాహన పెరిగింది. చేతులను పరిశుభ్రంగా సబ్బుతో కడుక్కోవాలి. లేదా హ్యాండ్ శానిటైజర్ వాడాలి. పిల్లలకు చిన్నప్పటి నుంచే శుభ్రతపై అవగాహన కల్పించాలి.



లెగ్ బీటింగ్ చేస్తున్న చిన్నారులు



డైవింగ్ చేస్తున్న చిన్నారులు

జోరుగా..హుషారుగా.. స్విమ్ చేద్దామా..

జాగ్రత్తలు..

- స్విమ్ చేసేముందు కాస్త జాగింగ్ చేసి స్నానం చేయడం తప్పనిసరి.
- స్వచ్ఛమైన నీటిలో మాత్రమే స్విమ్మింగ్ చేయాలి.
- చర్మవ్యాధులు, అంటువ్యాధులు ఉన్నవారిని స్విమ్మింగ్ చేసేందుకు అనుమతించవద్దు.
- పిల్లలు తమకు కేటాయించిన ప్రాంతంలోనే ఈత నేర్చుకోవాలి.



- స్విమ్ చేసేపుడు కోచ్ సూచనలు పాటించాలి. స్విమ్మింగ్ డ్రెస్, క్యాప్, గ్లాసెస్, ట్యూబ్‌లు వినియోగించాలి. కోచ్‌ల పర్యవేక్షణలో నీటిలో కూర్చోవడం, తిరగడం, తేలడం, ఎగరడం, ఈదడం వంటివి తొలుత ప్రాక్టీస్ చేయాలి.
- చెవిలోకి నీరు వెళ్తే ఫంగస్ ఏర్పడుతుంది. ఇయర్ ప్లగ్స్ వాడాలి.
- తలవెంట్రుకలు రాలకుండా క్యాప్ వాడాలి.
- స్విమ్మింగ్‌లో శిక్షణ పొందాలనుకునే పిల్లలు, పెద్దలు తప్పనిసరిగా స్విమ్మింగ్ డ్రెస్ ధరించాలి. స్విమ్ వేర్, హెడ్ క్యాప్, కంటి అద్దాలు, ఇయర్ ప్లగ్స్‌ను ధరించాలి.

- ఆనందానికి, వ్యాయామానికి ఈత
- కళకళలాడుతున్న స్విమ్మింగ్ పూల్స్

కరీంనగర్ స్పోర్ట్స్, మే 4 (ఆంధ్రజ్యోతి): చిన్నారుల నుంచి పెద్దల వరకు వేసవిలో ఈతకు సిద్ధమవుతున్నారు. దీంతో స్విమ్మింగ్ పూల్స్‌లో సందడి పెరిగింది. పెద్దలతోపాటు పట్టణ ప్రాంత పిల్లలు ఈతపై మక్కువ పెంచుకుంటున్నారు. పల్లె ప్రజానీకం ప్రకృతి అందాల చెంత సేద తీరుతుండగా పట్టణ ప్రాంతాల వారు స్విమ్మింగ్ పూల్స్‌ను ఆశ్రయిస్తున్నారు. కరీంనగర్‌లో పలు స్విమ్మింగ్ పూల్స్ అందుబాటులో ఉన్నాయి. నిర్వాహకులు బ్యాచ్‌ల వారీగా శిక్షణకు అవకాశం కల్పిస్తున్నారు. పెద్ద సంఖ్యలో ఔత్సాహికులు రావడంతో పూల్స్ ఉదయం, సాయంత్రం కిటకిటలాడుతున్నాయి.

● ఈతతో లాభాలెన్నో..

ఈత చక్కని వ్యాయామం. ఈత కొడితే అన్ని అవయవాలకు వ్యాయామం అందుతుంది. ఒంట్లో ఉన్న



అదనపు కొవ్వు కరుగుతుంది. మధుమేహంతో బాధ పడే వారికి ఉపశమనం లభిస్తుంది. నిత్యం ఈదడం ద్వారా ఆకలి, చురుకుదనం, జ్ఞాపకశక్తి వృద్ధి చెందుతాయి. రక్తపోటు గుండె సంబంధిత వ్యాధులు అదుపులో ఉంటాయి. ఊపిరితిత్తులకు మంచి వ్యాయామం లభిస్తుంది. సుమారు 50 నిమిషాలపాటు ఈత కొడితే 300 కాలరీల వరకు శక్తి ఖర్చవుతుంది. నీటిలో ఆపద సమయాల్లో మనల్ని మనం కాపాడుకోవడమే కాకుండా ఇతరులను కాపాడవచ్చు.

● ఈత కొట్టే పద్ధతులు..

ఈతను నాలుగు విధాలుగా కొట్టవచ్చు. ఫ్రీ స్టైల్, బ్యాక్ స్ట్రోక్, బ్రెస్ట్ స్ట్రోక్, బటర్ ఫ్లై విధానంలో ఈత కొట్టవచ్చు.

● రక్షణ పద్ధతి డోవింగ్..

స్విమ్మింగ్ నేర్చుకున్న అనంతరం తప్పక ఈ రక్షణ పద్ధతి డోవింగ్(లైఫ్ సేవింగ్)ను నేర్చుకోవాలి. కొన్ని సందర్భాల్లో నీటిలో మునిగిపోతున్న వ్యక్తులనువారికి ఎలాంటి హాని కలుగకుండా రక్షించే పద్ధతి ఇది.

వేసవి సెలవుల సద్వినియోగం..

- అరుణవ్‌పాల్‌సింగ్



ఈ వేసవి సెలవుల్లో స్విమ్మింగ్ పూర్తిగా నేర్చుకుంటున్నాను. దీంతో వేసవి సెలవులను సద్వినియోగం చేసుకున్నట్లవుతుంది. మా తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఈ శిక్షణలో చేరాను.

సరదాగా ఉంది..

- రేనుశ్రీ, హిమాన్సు



ఈ వేసవిలో ఎండలు అధికంగా ఉన్నాయి. ఎండ తీవ్రతను తట్టుకునేందుకు స్విమ్మింగ్ మంచి మార్గం. స్విమ్మింగ్ చేస్తుంటే సరదాగా ఉంది. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం శిక్షణ పొందుతున్నాను.

ఆరోగ్య ప్రదాయని స్విమ్మింగ్..

- సంపత్ కుమార్, కోచ్



విద్యార్థులకు ఆరోగ్య ప్రదాయని స్విమ్మింగ్. ప్రతిరోజు స్విమ్మింగ్ చేస్తే ఫిట్‌నెస్ పెరుగుతుంది. నీటి ప్రమాదాల నుంచి బయట పడేందుకు దోహదపడుతుంది. విద్యార్థుల నుంచి మంచి స్పందన లభిస్తుంది.

స్విమ్మింగ్ సర్వరోగ నివారణి..

- వి శ్రీనివాస్‌గౌడ్, డీవైఎస్‌వో



స్విమ్మింగ్ సర్వరోగ నివారణిగా ఉపయోగపడుతుంది. పిల్లల నుంచి పెద్దల వరకు ప్రతిరోజు స్విమ్మింగ్ చేయవచ్చు. అంబేద్కర్ స్టేడియం స్విమ్మింగ్ పూల్‌లో కోచ్‌లతో విద్యార్థులకు ప్రత్యేకమైన శిక్షణను అందిస్తు న్నాం. ఈ మధ్యనే స్విమ్మింగ్ పూల్‌ను ఆధునీక రించాం. చిన్నారుల కోసం బేబీ పూల్‌ను ప్రారం భించాం. విద్యార్థులు, యువత నుంచి ఈ వేసవిలో మంచి స్పందన లభిస్తుంది.

మల్లన్న ఆలయంలో భక్తుల రద్దీ

● దర్శనానికి రెండు గంటలు



పట్నాలు వేస్తున్న ఒగ్గు పూజారులు

ఓదెల, మే 4 (ఆంధ్రజ్యోతి): ఓదెల మల్లన్న ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఆదివారం వివిధ జిల్లాల నుంచి భక్తులు చేరుకొని పూజలు నిర్వహించారు. డీపీవో వీర బుచ్చయ్య దంపతులు, జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్ల ఎస్‌ఐలు కుటుంబాల వారీగా ఆలయంలో అర్చనలు, ఒగ్గు పూజారులతో పట్నాలు వేయించి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే భక్తులసంఖ్య పెరగడంతో క్యూలో రెండుగంటలపాటు వేచిఉండి భ్రమరాంబ మల్లికార్జున స్వామిని దర్శించుకున్నారు. ఆలయ జూనియర్ అసిస్టెంట్ మద్దసాని కుమారస్వామి డిపివో దంపతులను సన్మానించి స్వామి చిత్రపటాన్ని అందజేశారు.

రూ.3 కోట్లతో ఉడాయించిన ఇద్దరు వ్యాపారులు

● లబోదిబోమంటున్న బాధితులు

ఎల్లారెడ్డిపేట, మే 4 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లిలో ఇద్దరు వ్యాపారులు సుమారు రూ 3 కోట్లు అప్పులు తీసుకుని ఉడాయించిన సంఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. రాజస్థాన్‌కు చెందిన ఓ వ్యక్తి రాచర్లగొల్లపల్లికి వలస వచ్చి స్థానికబట్టల దుకాణం నిర్వహించేవాడని తెలిసింది. అతన్ని నమ్మిన పలువురు రూ1.50కోట్లవరకు బాకీలు ఇచ్చారని సమాచారం. స్థానికంగా నివసిస్తున్న మరోబట్టలు, సూపర్‌మార్కెట్ వ్యాపారి సైతం నష్టాలపాలయ్యాడని తెలిసింది. ఆయనరూ.1.50కోట్ల వరకు అప్పులు చేశాడని సమాచారం. బాకీల వారి బాధలు అధికమవడంతో రెండురోజుల కిందట ఇద్దరు వ్యాపారులు ఇళ్లకు తాళాలు వేసి కుటుంబ సభ్యులతో కలిసి ఉడాయించారని తెలిసింది. రెండు రోజులుగా వ్యాపారులు కనిపించకపోవడం, ఇళ్లకు తాళాలు వేసి ఉండడంతో బాధితులు లబోదిబోమంటున్నారు.

ప్రశాంతంగా ముగిసిన ఎప్‌సెట్ ఇంజనీరింగ్ పరీక్షలు

తిమ్మాపూర్, మే 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఎప్‌సెట్-2025 పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా ముగిశాయి. చివరిరోజు ఆదివారం జరిగిన ఇంజనీరింగ్ విభాగం పరీక్షలో కరీంనగర్ జోన్‌లో 12పరీక్ష కేంద్రాలలో కలిపి ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు జరిగిన మొదటిసెషన్‌లో 2,535మంది విద్యార్థులకు 2,432మంది హాజరయ్యారు. 103మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 3నుంచి సాయంత్రం 6గంటల వరకు జరిగిన రెండవ సెషన్‌లో 2,535మంది విద్యార్థులకు 2,451మంది హాజరు కాగా 84మంది గైర్హాజరైనట్లు పరీక్ష నిర్వాహకులు తెలిపారు. మొత్తంగా 5,070 మంది అభ్యర్థులకు గాను 4,883 మంది అభ్యర్థులు హాజరు కాగా 187మంది గైర్హాజరైనట్ల నిర్వాహకులు తెలిపారు.



బోనాలతో ఆలయానికి తరలిన గ్రామస్థులు

ఖాసీంపేటలో ఘనంగా పోచమ్మ బోనాలు

గన్నేరువరం, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖాసీంపేటలో గ్రామస్థులంతా కలిసి ఆదివారం పోచమ్మబోనాలను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని మహిళలు ఇంటికో బోనం ఎత్తుకుని డప్పుచప్పుళ్లతో, శివసత్తుల పూనకాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పంటలు బాగా పండి ప్రజలంతా ఆనందంగా ఉండాలని వేడుకున్నారు. కార్యక్రమంలో మాజీసర్పంచ్ గంప మల్లీశ్వరి, మాజీఎంపీటీసీ ఏలేటి స్వప్న, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంప వెంకన్న, బీజేపీ నాయకుడు ఏలేటి చంద్రారెడ్డి, అధిక సంఖ్యలో మహిళలు, యువకులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయానికి పోటెత్తిన భక్తజనం

- కోడెమొక్కులు చెల్లించుకున్న భక్తులు
- దర్శనానికి మూడు గంటల సమయం
- దర్శించుకున్న హైకోర్టు జడ్జి



భక్తులతో సందడిగా మారిన రాజన్న ఆలయ ప్రాంగణం

వేములవాడ కల్చరల్, మే 4 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శైవక్షేత్రం ఆదివారం భక్తులతో పోటెత్తింది. సెలవురోజు కావడంతో రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం, ఆవరణతో పాటుగా క్యూలైన్‌లు భక్తులతో కిక్కిరిసిపోయాయి. శనివారం సాయంత్రం చేరుకున్న భక్తులు ఆలయ వసతిగదుల్లో విడిది చేశారు. తెల్లవారు జామున భక్తులు ధర్మదర్శనం, కోడెమొక్కు క్యూలైన్‌లో భక్తులు బారులుతీరారు. కోడెమొక్కు క్యూలైన్‌లో సుమారు మూడు గంటలపాటు నిరీక్షించినట్లు భక్తులు తెలిపారు. శీఘ్రదర్శనం క్యూలైన్‌ల ద్వారా భక్తులు ఆలయంలోకి చేరుకోగా భక్తుల తాకిడి దృష్ట్యా బ్రేక్‌దర్శనం క్యూలైన్‌లోను భక్తులను అనుమతించారు. దీంతో క్యూలైన్‌లు అన్ని భక్తులతో సందడిగా మారాయి. ఆయా క్యూలైన్‌ల ద్వారా భక్తులు ఆలయంలోకి చేరుకుని శ్రీస్వామివారికి కోడెమొక్కు చెల్లించుకుని శ్రీపార్వతిపరమేశ్వరులను దర్శించుకున్నారు. గండాదీపంలో నూనెపోస్తూ గండాలు తొలగిపోవాలని వేడుకున్నారు. పరివార దేవతాలయాల్లో ప్రత్యేక పూజలో పాల్గొని అనుబంధ ఆలయాలను దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఈవో వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏఈవోలు బ్రహ్మన్నగారి శ్రీనివాస్, శ్రావణ్‌కుమార్, అశోక్‌కుమార్, సూపరింటెండెంట్ వరి నర్సయ్య, నరేందర్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ రాజేందర్‌లు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రాజన్నను దర్శించుకున్న హైకోర్టు జడ్జి మధుసూదన్‌రావు..

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారిని తెలంగాణ హైకోర్టు జడ్జి బీ.ఆర్. మధుసూదన్‌రావు తన కూతురుతో కలిసి దర్శించుకున్నారు. శనివారం రాత్రి వేములవాడకు చేరుకున్న జడ్జికి జిల్లా ప్రిన్సిపల్ జడ్జి పుష్పలత, సీనియర్ సివిల్ జడ్జిలు అజయ్‌కుమార్ జాదవ్, లక్ష్మణాచారి, ప్రోటోకాల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రవీణ్‌కుమారులు పూల మొక్కలు అందజేసి స్వాగతం పలికారు. ఆదివారం ఉదయం రాజన్న దర్శనానికి విచ్చేసిన జడ్జికి ఆలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. శ్రీస్వామివారి ప్రత్యేక పూజ అనంతరం ఆలయ అద్దాల మండపంలో అర్చకులు వేదోక్త ఆశీర్వచనం ఇవ్వగా, ఆలయ ఏఈవో బ్రహ్మన్నగారి శ్రీనివాస్ శ్రీస్వామివారి శేషవస్త్రం, రాజన్న ప్రసాదాన్ని అందజేశారు.

రాజన్నను దర్శించుకున్న రాష్ట్ర సైబర్ క్రైం అడిషనల్ ఎస్పీ..

వేములవాడ కల్చరల్: వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారిని రాష్ట్ర సైబర్ క్రైం అడిషనల్ ఎస్పీ చంద్రకాంత్ ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. రాజన్న ఆలయానికి విచ్చేసి శ్రీపార్వతిపరమేశ్వరులను దర్శించుకున్నారు. అనంతరం నాగిరెడ్డి మండపంలో అర్చకులు ఆశీర్వచనం గావించి రాజన్న ప్రసాదాన్ని అందజేశారు.



జడ్జి మధుసూదన్‌రావుకు రాజన్న ప్రసాదం అందజేస్తున్న ఏఈవో శ్రీనివాస్



చంద్రకాంత్‌కు రాజన్న ప్రసాదాన్ని అందజేస్తున్న అర్చకులు



స్వామి వారి దర్శనం చేసుకుంటున్న భక్తులు

కొనసాగుతున్న నరసింహ నవరాత్రోత్సవాలు

ధర్మపురి, మే 4 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నృసింహ స్వామి దేవాలయంలో రెండో రోజు ఆదివారం నృసింహ నవరాత్రోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చరణల మధ్య అర్చకులు పురుషసూక్త, శ్రీసూక్త, కల్పోక్త, న్యాసపూర్వక, శోడషోపచార పూజ, సహస్ర నామార్చన, పంచోపనిషత్తులచే రుద్రాభిషేకం కార్యక్రమాలు నిర్వహించారు. సామవేద పారా యణంతో అభిషేక పూజలు, వాస్తు, యోగిని, క్షేత్రపాలక, నవగ్రహ, సర్వతోభద్ర మండల, స్థాపిత దేవతా పూజలు, సహస్ర వరుణ స్థాపన, స్థాపిత దేవత హోమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్ పాల్గొన్నారు.



అలంకరణలో స్వామి వారు

ప్రశాంతంగా నీట్

● ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులకు అనుమతి నిరాకరణ



ఉదయం 11 గంటలకే పరీక్షా కేంద్రం వద్ద వేచి ఉన్న విద్యార్థులు, తల్లిదండ్రులు

కరీంనగర్, మే 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కరీంనగర్ జిల్లాలో ఆదివారం నిర్వహించిన నీట్‌ప్రశాంతంగా ముగిసింది. కలెక్టర్ పమేలా సత్పతి ఆధ్వర్యంలో అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. జిల్లాలో ఏడు కేంద్రాలను ఏర్పాటు చేయగా 2975 మంది విద్యార్థులకు 2914 మంది పరీక్ష రాశారు. 61 మంది విద్యార్థులు పరీక్ష రాయలేదు. కరీంనగర్ బైపాస్‌రోడ్‌లోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్, ఎస్సారార్ కళాశాలల్లో పరీక్షా కేంద్రాలను కలెక్టర్ పమేలా సత్పతి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పరీక్ష ప్రశాంతంగా జరిగేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఆమె వెంట నెహ్రూ యువ కేంద్ర కో-ఆర్డినేటర్ రాంబాబు, ఎస్సారార్ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, తహసీల్దార్ రాజేష్ ఉన్నారు.

● వివిధ నీట్ పరీక్షా కేంద్రాలను అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు.

● మూడు నిమిషాల ఆలస్యంతో..



క్యూలో వేచి ఉన్న విద్యార్థులు

నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీకళాశాల కేంద్రంలో మూడు నిమిషాలు ఆలస్యంగా రావడంతో వేములవాడకు చెందిన కుమ్మరి వైష్ణవి పరీక్షను కోల్పోయింది. వైష్ణవితోపాటు ఆమెతల్లి పరీక్షకు అనుమతించాలని అధికారులను కోరుతూ విలపించారు. సంవత్సరం వృథా అవుతుందని, పుస్తెలతాడు అమ్మి లక్షా 60వేలతో లాంగ్‌టర్మ్ కోచింగ్ ఇప్పించామని, పరీక్షకు హాజరయ్యేందుకు రాగా కేవలం మూడు నిమిషాల ఆలస్యంతో అధికారులు అనుమతించలేదని విద్యార్థిని తల్లి ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే మరో విద్యార్థికూడా ఆలస్యంగా పరీక్షా కేంద్రానికి రాగా అధికారులు కేంద్రంలోకి అనుమతించలేదు.

తిమ్మాపూర్: కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని అలుగునూర్‌లో గల కేంద్రీయ విద్యాలయ పరీక్ష కేంద్రంలో 384మంది అభ్యర్థులకు గాను 378మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కాగా ఆరుగురు గైర్హాజరయ్యారు. తెలంగాణ సాంఘిక గురుకుల పాఠశాల(సీవోఈ)లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో 480మంది 467మంది హాజరు కాగా 13మంది గైర్హాజరయ్యారని అధికారులు వెల్లడించారు. ఉదయం 11గంటల నుంచే అభ్యర్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించారు. పరీక్ష సమయానికి అరగంట ముందే అంటే 1.30గంటలకు పరీక్ష కేంద్రాల వద్ద గేట్లును మూసేశారు. నిమిషం నిబంధన కారణంతో కేంద్రీయ విద్యాలయానికి ఒక విద్యార్థిని అలస్యంగా రాగా ఆమెను అధికారులు అనుమతించలేదు. దీంతో అమ్మాయి నిరాశతో వెనుతిరిగింది. పరీక్ష కేంద్రాల వద్ద ట్రాఫిక్‌తోపాటు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. అలుగునూర్‌లోని రెండు నీట్‌పరీక్ష కేంద్రాలను కరీంనగర్ సీపీ గౌస్ ఆలం, అదనపుకలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ పరిశీలించారు.

కొడిమ్యాలలో..

కొడిమ్యాల: కొడిమ్యాల మండలంలోని నాచుపల్లి జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన నీట్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి, కళాశాలలోని రెండు కేంద్రాల్లో 758 మంది విద్యార్థులకు గాను 740 మంది విద్యార్థులు హాజరు కాగా 18 మంది గైర్హాజరైనట్లు కలెక్టర్ బి.సత్యప్రసాద్ తెలిపారు. మొదటి పరీక్షా కేంద్రంలో 480 మందికి 467 మంది, రెండో పరీక్షా కేంద్రంలో 278 మందికి 273 హాజరైనట్లు పరీక్షల సూపరింటెండెంట్లు డాక్టర్ ఎస్.జగదీష్‌కుమార్, డాక్టర్ సురేష్ శ్రీపాద తెలిపారు. మల్లాపూర్ మండలం వీపీ రావుపేటకు చెందిన నవ్య అనే విద్యార్థిని రెండు నిమిషాలు ఆలస్యంగా రాగా అధికారులు అనుమతించ లేదు. పరీక్షా కేంద్రాలను కలెక్టర్ బి.సత్యప్రసాద్, ఆర్డీవో మధుసూదన్‌గౌడ్ పరిశీలించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.విశ్వనాథరాజు, సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ బి.ప్రభాకర్, తహసీల్దార్ రమేష్ పర్యవేక్షించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ ఆధ్వర్యంలో మల్యాల సీఐ నీలం రవి, కొడిమ్యాల ఎస్సై ఎస్.సందీప్ బందోబస్తు నిర్వహించారు.



విద్యార్థిని కంకణాన్ని తీస్తున్న పేరెంట్



ముక్కుపుడక తీస్తున్న విద్యార్థిని



పుస్తెలతాడు అమ్మానంటూ పసుపుతాడును చూపుతున్న వైష్ణవి తల్లి



కన్నీటి పర్యంతమైన వైష్ణవి, తల్లిదండ్రులు

దేశద్రోహుల వెన్నులో వణుకు పుట్టేలా ఏక్తా యాత్ర

- కేంద్ర హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, మే 4(ఆంధ్రజ్యోతి): దేశద్రోహుల వెన్నులో వణుకు పుట్టేలా హిందూ ఏక్తా యాత్రలో పాల్గొనాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం నగరంలోని రేకుర్తిలో ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో హిందూ ఏక్తా యాత్ర సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పహల్గాం ఘటనతో దేశ ప్రజలంతా ఆవేశంతో రగిలిపోతున్నారన్నారు. మోదీ తెగువ, పట్టుదలను యావత్ ప్రపంచమంతా త్వరలోనే చూస్తుందన్నారు. దేశమంతా గల్లా ఎగరేసుకునేలా మోదీ చర్యలు ఉండబోతున్నాయన్నారు. ప్రస్తుతం దేశ ప్రజలంతా ఐక్యత చాటాల్సిన అవసరం ఉందన్నారు. హనుమాన్ జయంతి సందర్భంగా ఈ నెల 22న కరీంనగర్‌లో కనీవినీ ఎరుగని రీతిలో హిందూ ఏక్తా యాత్ర నిర్వహించబోతున్నట్లు చెప్పారు. హిందూ ఏక్తా యాత్ర తర్వాత కరీంనగర్‌లో బలవంతపు మతమార్పిడులు, లవ్ జిహాదీలు ఆగిపోయాయన్నారు. ఒక దేశంతో యుద్ధం చేయాలంటే అనేక పర్యావసనాలు ఎదురవుతాయని, అన్నీ బేరీజు వేసుకొని ముందుకు వెళ్లాలని, ఆ విషయంలో మోదీ, అమిత్‌షా, రాజ్‌నాథ్‌సింగ్ ఆలోచిస్తున్నారని అన్నారు. దేశంలోకి ఉగ్రవాదులు చొరబడి బాంబు పేలుళ్లు, కాల్పులకు పాల్పడుతున్నారంటే ఇక్కడున్న వారి సహకారంతోనే సాధ్యమవుతుందన్నారు. జగిత్యాల, కోరుట్ల పీఎఫ్ఐకి అడ్డాగా మారాయని, బహిరంగంగా పీఎఫ్ఐ కార్డులతో ర్యాలీలు నిర్వహించినా కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలకులు కేసులు కూడా పెట్టలేదని అన్నారు. హిందూ ఏక్తా యాత్రకు బూత్‌ల వారీగా సమావేశాలు నిర్వహించి యాత్రకు తరలి రావాలన్నారు. జీహెచ్ఎంసీ, ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా హిందువులంతా ఏకమయ్యారని, తెలంగాణ వ్యాప్తంగా స్థానిక ఎన్నికల్లో ఏకమై కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు బుద్ధి చెప్పడం ఖాయమని అన్నారు. ఈ సమావేశంలో కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాల బీజేపీ అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, రెడ్డబోయిన గోపి, మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, నగర మేయర్లు సునీల్‌రావు, డి శంకర్, డిప్యూటి మేయర్ గుగ్గిళ్లపు రమేష్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న బండి సంజయ్‌కుమార్

ఉద్యమకారుల అంశంపై ప్రభుత్వ వైఖరి ప్రకటించాలి

కరీంనగర్ టౌన్, మే 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం జూన్ 2 నాటికి తెలంగాణ ఉద్యమకారుల అంశంపై ప్రభుత్వం స్పష్టమైన వైఖరి ప్రకటించాలని వక్తలు డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని ఒక హోటల్‌లో కరీంనగర్ ఉద్యమకారుల ఫోరం జిల్లా చైర్మన్ కనకం కుమారస్వామి ఆధ్వర్యంలో ఉత్తర తెలంగాణ ఉద్యమకారుల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, టీయూఎఫ్ చైర్మన్ చీమ శ్రీనివాస్, ఫుడ్ కమిషన్ సభ్యుడు ఓరుగంటి ఆనంద్ మాట్లాడారు. ప్రత్యేక రాష్ట్రం కోసం అహర్నిశలు కష్టపడి తెలంగాణ సిద్ధించే వరకు కొట్లాడిన ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను ఇప్పటి వరకు నెరవేర్చలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాల అధ్యక్షులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బుర్ర సతీశ్‌గౌడ్‌కు గద్దర్ ఐ కాన్ అవార్డు


అవార్డు అందుకుంటున్న బుర్ర సతీశ్‌గౌడ్

కరీంనగర్ కల్చరల్, మే 4 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ బిర్లా ప్లానిటోరియంలో సాయి అలేఖ్య సాంస్కృతిక సంఘ్ సేవా వారి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కవి, గాయకుడు బుర్ర సతీశ్‌గౌడ్‌కు గద్దర్ ఐ కాన్ అవార్డును అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అందజేశారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో కవి గాయకుల పాత్ర మహోన్నతమైనదని స్పీకర్ కొనియాడారు. పలువురు కళాకారులు, ప్రజాప్రతినిధులు సతీశ్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రజా గాయని విమలక్క, సాంస్కృతిక సారథి చైర్ పర్సన్ వెన్నల గద్దర్, పట్నం మహేందర్‌రెడ్డి, ఉప్పుల శ్రీనివాస్ గుప్త తదితరులు పాల్గొన్నారు.

పౌరాణిక పద్యనాటకాల పోస్టర్ ఆవిష్కరణ

కరీంనగర్ కల్చరల్, మే 4 (ఆంధ్రజ్యోతి) : మన సమైక్యత కల్చరల్ అకాడమి నేతృత్వంలో సురభి సంస్థ నిర్వహణలో కళాభారతిలో 13, 14, 15 తేదీల్లో నిర్వహించే పౌరాణిక పద్యనాటకాల పోస్టర్‌ను ఆదివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ పమేలా సత్పతి ఆవిష్కరించారు. 13న మాయాబజార్, 14న బాలనాగమ్మ, 15న షిరిడి సాయిబాబా మహత్యం నాటకాలు ప్రదర్శించనున్నట్లు అకాడమి అధ్యక్షుడు రొడ్డ యాదగిరి తెలిపారు. కార్యక్రమంలో రొడ్డ యాదగిరి, కృపాదానం పాల్గొన్నారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు


పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

కరీంనగర్ కల్చరల్, మే (ఆంధ్రజ్యోతి) 4 : స్థానిక భగత్‌నగర్ జడ్పీ క్వార్టర్స్‌లోని సముదాయ ఆలయాల వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజు ఆదివారం అయ్యప్ప ఆలయంలో ఆలయ 30వ వార్షికోత్సవం సందర్భంగా గణపతి హోమం, అభిషేకాలు, మహాపడిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో చైర్మన్ యాగండ్ల అనిల్‌కుమార్‌గౌడ్, ధర్మకర్తలు సత్యనారాయణ, శ్రీనివాస్, కవిత, ఆనంద్‌రెడ్డి, కృష్ణ, ఈవో కొన్న కాంతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలు విడుదల చేయాలి

భగత్‌నగర్, మే 4(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న డీఏలు వెంటనే విడుదల చేయాలని బీజేపీ విశ్రాంత ఉద్యోగ, ఉపాధ్యాయ రాష్ట్ర సెల్‌కో-చైర్మన్ నరహరి లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం విశ్రాంత ఉద్యోగ, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన ఐదు డీఏలు పెండింగ్‌లో ఉన్న బకాయి బిల్లులు, 51 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ ఆమోదించి అమలు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా సెల్ నాయకులు గంట్ల నర్సింహారెడ్డి, నంది మోహన్‌రెడ్డి, కర్ర ప్రభాకర్‌రెడ్డి, పర్శరాం, వెంకట్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

● న్యూస్‌బాక్స్

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గణేశ్‌నగర్, మే 4 (ఆంధ్రజ్యోతి): మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ వన్, టు, రూరల్ ఏడీఈలు శ్రీనివాస్ గౌడ్, లావణ్య, రఘు ప్రకటనలో తెలిపారు. ఉదయం 8:30 నుంచి 10:30 వరకు ఆర్‌సీపీ బైపాస్ రోడ్, లేక్ పోలీస్ స్టేషన్, సప్తగిరికాలనీ, సాయిబాబా గుడి రోడ్డు, అంజనాద్రి ఆలయం, శ్రీనగర్ కాలనీ, ఆసీపీ, ఉదయం 8 గంటల నుంచి 10 వరకు అజ్మత్‌పుర, జైలు ప్రాంతం, వేంకటేశ్వర ఆలయం, సవరన్‌స్ట్రీట్, ఆసియాన హాస్పిటల్, శ్రీదేవి హాస్పిటల్, మంచిర్యాల చౌరస్తా, ఉదయం 8 గంటల నుంచి 11 వరకు విద్యారణ్యపురి, సరస్వతినగర్, మణికేశ్వర్‌నగర్ ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

భీమ్ ఆర్మీ కార్యవర్గం

సుభాష్‌నగర్, మే 4(ఆంధ్రజ్యోతి): భీమ్ ఆర్మీ జిల్లా నూతన కమిటీని ఆదివారం నగరంలోని కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా లింగంపల్లి వెంకటేష్, ఉపాధ్యక్షులుగా సింకురి రమేష్, కొలిపాక వినోద్, ప్రధానకార్యదర్శిగా గసికంటి సంపత్, సంయుక్త కార్యదర్శిగా బండ శంకర్, కోశాధికారిగా న్యాత శ్రీధర్, ప్రచారకార్యదర్శిగా సుంకె హరికృష్ణ, కార్యదర్శులుగా కొలపురి వెంకటేష్, తడగొండ ప్రవీణ్, శనిగరపు సురేష్, సిరిసిల్ల రాజేందర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోయినపల్లి చంద్రయ్య మాట్లాడుతూ మహనీయుల ఆశయాలకు అనుగుణంగా పని చేయాలని సూచించారు.

సంతాపం

భగత్‌నగర్, మే 4(ఆంధ్రజ్యోతి): హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రియదర్శిని అకాల మరణంపై కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కరీంనగర్ ప్రిన్సిపల్ జడ్జిగా సేవలందించిన విషయాన్ని గుర్తు చేస్తూ ఆమె కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు.

రైతులకు భూధార్ కార్డులు

- నేటి నుంచి వివరాల నమోదు

కరీంనగర్ రూరల్, మే 4 (ఆంధ్రజ్యోతి): ఆధార్ కార్డులా ప్రతీ రైతుకు 11 నంబర్లతో కూడిన యూనిక్ కోడ్‌ను కేటాయించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా సోమవారం నుంచి జూన్ 4వ తేదీ వరకు వ్యవసాయ శాఖ అధికారులకు రైతులు వివరాలు అందించాలని ఏవో సత్యం కోరారు.

మండలంలోని చామనపల్లి, గోపాల్‌పూర్, మొగ్దుంపూర్, నగునూర్ గ్రామాల్లో సోమవారం నుంచి 7వ తేదీ వరకు, బహదూర‌ఖాన్‌పేట, గోపాల్‌పూర్, మొగ్దుంపూర్, ఇరుకుల్ల, నగునూర్‌లో 8 నుంచి 12వ తేదీ వరకు, దుబ్బపల్లి, దుర్శేడ్, ఇరుకుల్ల, బొమ్మకల్, వల్లంపహాడ్‌లో 13 నుంచి 15వ తేదీ వరకు, జూబ్లీనగర్, బొమ్మకల్, చేగుర్తి, చెర్లబూత్కూర్, ఆరెపల్లి, తీగలగుట్టపల్లిలో 16 నుంచి 20వ తేదీ వరకు,ఫకీర్‌పేట, చేగుర్తి, నల్లగుంటపల్లి, తీగలగుట్టపల్లి 21 నుంచి 22వరకు, ఎలబోతారం, చేగుర్తి, గోపాల్‌పూర్, దుర్శేడ్, బొమ్మకల్, మొగ్దుంపూర్, నగునూర్, తీగలగుట్టపల్లి 23 నుంచి 27 వరకు, తహెర్ కొండాపూర్, చేగుర్తి, గోపాల్‌పూర్, దుర్శేడ్, చెర్లబూత్కూర్, నగునూర్ వల్లంపహాడ్‌లో 28 నుంచి 30 వరకు, చామనపల్లి, బొమ్మకల్, చేగుర్తి, చెర్లబూత్కూర్, ఇరుకుల్ల, ఆరపల్లి, వల్లంపహాడ్ గ్రామాల్లో 31 నుంచి జూన్ 4 వరకు రైతుల వివరాలను సేకరించనున్నట్లు ఏవో సత్యం వివరించారు. ప్రతీ రైతు భూముల వివరాలను న మోదు చేసుకొని భూధార్ కార్డును పొందాలని సూచించారు.

చిరుతల భజన పోస్టర్ ఆవిష్కరణ

కరీంనగర్ కల్చరల్, మే 4 (ఆంధ్రజ్యోతి) : కరీంనగర్ ఫోక్ ఆర్ట్స్ అకాడమి, కళారవళి కల్చరల్ అసోసియేషన్, సల్వాజి ఈవెంట్స్ అండ్ కల్చరల్ గ్రూప్ ఆధ్వర్యంలో ఈ నెల 8న కళాభారతిలో నిర్వహించే ప్రపంచ రికార్డు కోసం చిరుతల భజన పోస్టర్‌ను ఆదివారం కరీంనగర్‌లో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ నియోజక వర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్ ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా జి కృపాదానం మాట్లా డుతూ తెలంగాణ ఉమ్మడి జిల్లాల నుంచి సుమారు 600 మంది కళాకారులు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 వరకు నిర్విరామంగా చిరుతల భజన చేయనున్నారని తెలిపారు.

ఉచిత వేసవి శిక్షణా శిబిరం ప్రారంభం

కరీంనగర్ కల్చరల్, మే (ఆంధ్రజ్యోతి) 4 : వేసవి శిక్షణలో భాగంగా చిన్న జీయరుస్వామి ఆశీస్సులతో వికాసతరంగిణి ఆధ్వర్యంలో సప్తగిరి కాలనీ కోదండ రామాలయంలో ఆదివారం ప్రజ్ఞ ఉచిత శిక్షణా శిబిరం ప్రారంభమైంది. శిబిరాన్ని రిటైర్డ్ ఎంఆర్వో శ్రీహరిరెడ్డి, మాజీ కార్పొరేటర్ తుమ్మల రమేశ్‌రెడ్డి ప్రారంభించారు. 18వ తేదీ వరకు ఉదయం 8 గంటల నుంచి 11 వరకు 8 నుంచి 15 సంవత్సరాల బాలబాలికలకు వివిధ అంశాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి పాల్గొన్నారు.

హనుమాన్ విగ్రహం ఆవిష్కరణ

భగత్‌నగర్, మే 4(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి పట్టణంలోని భక్త మార్కండేయ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన హనుమాన్ విగ్రహాన్ని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కొత్తపల్లి కూడలిలోని అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేశారు. అంతకుముందు కొత్తపల్లి బీజేపీ నాయకులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చి ఆయనకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో కరీంనగర్ మాజీ మేయర్ సునీల్‌రావు, కొత్తపల్లి మాజీ చైర్మన్ రుద్రరాజు, మాజీ ఎంపిపి వాసాల రమేష్, కమిటీ సభ్యులు స్వర్గం నర్సయ్య, వేముల చంద్రశేఖర్, అనుమల్ల సత్యనారాయణ, కమటం రాజేశం, వేముల సాగర్, స్వర్గం శంకరయ్య, గుండేటి విశ్వనాథం, పొన్నం సత్యనారాయణ, గుంటుక వంశి మేరుగు సుభాష్, చిట్కూరి శ్రీనివాస్, ఖాజాఖాన్, నరాల రాజకుమార్ పాల్గొన్నారు.

బందోబస్తు పరిశీలించిన సీపీ


ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీపీ గౌస్ ఆలం

కరీంనగర్ క్రైం , మే 4(ఆంధ్రజ్యోతి): పోలీస్ కమిషనరేట్‌లోని నీట్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలను ఆదివారం పోలీస్‌కమిషనర్ గౌస్ ఆలం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి ఘటనలూ చోటు చేసుకోకుండా పటిష్ఠ భద్రత కల్పించినట్లు చెప్పారు. మెటల్ డిటెక్టర్, ఫ్రిస్కింగ్, పెట్రోలింగ్ ఎస్కార్ట్ టీంలు, స్పెషల్‌టీం, ఫుట్ పెట్రోలింగ్ టీంల పనితీరును పరిశీలించినట్లు తెలిపారు. ఏసీపీ మాధవి, వెంకటస్వామి, సీఐలు ఉన్నారు.

మనిషికి ప్రేమ ఓ కనీస అవసరం


'ఇదేమి యుద్ధం' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

కరీంనగర్ కల్చరల్, మే 4 (ఆంధ్రజ్యోతి) : కూడు, గూడు, దుస్తుల్లా ప్రేమ కూడా మనిషికి కనీస అవసరమేనని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ నలిమెల భాస్కర్ అన్నారు. తెలంగాణ రచయితల వేదిక, ఉమ్మడి శెట్టి లిటరసి ట్రస్టు సంయుక్తంగా ఆదివారం ఫిలింభవన్‌లో నిర్వహించిన ఉమ్మడిశెట్టి సాహిత్య పురస్కారాల సభలో మాట్లాడారు. కవిత్వ పఠనంతో మనిషికి చిటికెడంత ప్రేమైనా అందాలన్నారు. ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు రాధేయ 37 ఏళ్లుగా పురస్కారాలు అందిస్తున్నట్లు చెప్పారు. విజయవాడకు చెందిన కవయిత్రి వైష్ణవిశ్రీకి ఉమ్మడిశెట్టి సత్యాదేవి సాహిత్య పురస్కారాన్ని, తిరుపతికి చెందిన మరో కవయి త్రి సుధా మురళికి రాధేయ కవితా పురస్కా రాన్ని, వరంగల్‌కు చెందిన యువ కవి నందకి షోర్‌కు ఉమ్మడిశెట్టి సతీశ్‌కుమార్ యువ పురస్కారాన్ని నలిమెల భాస్కర్ అందజేశారు. సుంకర గోపాలయ్య, చామర్తి మానస, డాక్టర్ సునీల్, సిద్ధార్థ పాల్గొన్నారు.

తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో కరీంనగర్‌కు చెందిన కవి జనగాని యుగంధర్ కవితా సంపుటి 'ఇదేమి యుద్ధం' పుస్తకాన్ని డాక్టర్ నలిమెల భాస్కర్ ఆవిష్కరించారు. నడిమెట్ల రామయ్య, పీఎస్ రవీంద్ర, డాక్టర్ స్వామి పాల్గొన్నారు.

సైదాపూర్‌ను డ్రగ్స్‌రహిత మండలంగా తీర్చిదిద్దాలి


సైదాపూర్‌లో డ్రగ్స్ నిర్మూలన పోరుయాత్ర ర్యాలీ

సైదాపూర్, మే 4 (ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండలాన్ని డ్రగ్స్ రహిత మండలంగా తీర్చిదిద్దేందుకు ప్రతీఒక్కరు భాగస్వాములు కావాలని వెన్కేపల్లి విశాల సహకార పరపతి సంఘం చైర్మన్ కొత్త తిరుపతిరెడ్డి అన్నారు. ఆదివారం డ్రగ్స్‌నిర్మూలన పోరుయాత్ర ముగింపు కార్యక్రమం మండల కేంద్రంలో జరిగింది. ఈ సందర్భంగా మహిళాసంఘాలు, గ్రామస్థులు డ్రగ్స్ నిర్మూలించాలని ర్యాలీచేపట్టారు. అనంతరం తిరుపతిరెడ్డి మాట్లాడుతూ యువతను కాపాడుకోవల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. డ్రగ్స్ అమ్మినట్లుగానీ, సేవించినట్లుగానీ తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన రిటైర్డ్ ఎంఈవో లక్ష్మారెడ్డి, రిటైర్డ్‌టీచర్ సారయ్య, టీంసభ్యులకు అభినందనలు తెలిపారు. జాక్‌చైర్మన్ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ డ్రగ్స్ పోరుయాత్రలో భాగస్వాములు అవుతున్న ప్రతీఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్‌కమిటీ చైర్మన్ దొంత సుధాకర్, ఎస్సై తిరుపతి, ఏపీఎం కుమారస్వామి, సమాఖ్య అధ్యక్షురాలు సమ్ము రజిత, మాజీసింగిల్‌విండో అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, సీసీలు, మహిళలు, నాయకులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ఇల్లందకుంట, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టేకుర్తి మోడల్ స్కూల్‌లో ఇంటర్ ప్రథమసంవత్సరం ఆంగ్లమాధ్యమంలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అయిలయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల5నుంచి 20వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపులు ఉండగా, ప్రతి గ్రూపులో 40సీట్ల చొప్పున ఖాళీలు ఉన్నాయన్నారు. బాలికలకు హాస్టల్ వసతి ఉందన్నారు. ఎలాంటి దరఖాస్తు ఫీజు లేదని, ఎంపికైన విద్యార్థుల జాబితా ఈనెల 26న కళాశాలలో అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.

కరపత్రం ఆవిష్కరణ

హుజూరాబాద్, మే 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద గౌతమ బుద్ధుని జయంతి ఉత్సవాల కరపత్రాన్ని ఆదివారం ఆవిష్కరించారు. ఈనెల 12న వడుకాపూర్, దూళికట్ట, 20న బీహార్ రాష్ట్రంలోని బుద్ధగయలో నిర్వహించే బుద్ధుని జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో వెంకన్న, జనార్దన్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన ప్రముఖులు

జమ్మికుంట రూరల్, మే 4 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలోని పీవీఆర్ గార్డెన్‌లో ఆదివారం జరిగిన ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి నాయకుడు మాదాసు రాహుల్ వివాహానికి పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, వివేక్ వెంకటస్వామి, కెఆర్ నాగరాజు, మేడిపల్లి సత్యం, ప్రజా గాయకురాలు విమలక్క, గద్దర్ కుమారుడు సూర్యం, గెల్లు శ్రీనివాస్‌యాదవ్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

మెడికల్ షాపుల మాయాజాలం..

- ప్రిస్క్రిప్షన్ లేకుండానే మందుల విక్రయాలు ● నామమాత్రంగా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ల తనిఖీలు ● షాపుల్లో బినామీల దందా.. కానరాని ఫార్మాసిస్టులు

హుజూరాబాద్, మే 4 (ఆంధ్రజ్యోతి): మెడికల్ షాపు చిన్నదైనా.. పెద్దదైనా అందులో ఫార్మాసిస్ట్ ఉండాలి. మందులు ఎలా వేసుకోవాలో రోగికి విడమర్చి చెప్పాలి. డాక్టర్ ప్రిస్క్రిప్షన్ ఉండడంతోపాటు రోగి శారీరక, మానసిక పరిస్థితిని బట్టే అవసరమైన మందులు ఇవ్వాలి. ఇలా మెడికల్‌షాపుల నిర్వాహకులు నిబంధనలను పాటించాలి. కానీ హుజూరాబాద్ డివిజన్‌లో మందుల దుకాణాల వ్యాపారం కిరాణ షాపుల్లాగా మారింది. డాక్టర్ రాసిచ్చే చిట్టీతో సంబంధం లేకుండానే ఎవరడిగినా మందులు ఇట్టే ఇచ్చేస్తున్నారు. డీ-ఫార్మసీ/ఎం-ఫార్మసీ సర్టిఫికెట్ ఉంటేచాలు.. మెడికల్‌షాపు పెట్టి ప్రజల ప్రాణాలతో చెలగాటమడుతున్నారు. జిల్లా డ్రగ్ కంట్రోల్ అధికారులు పట్టించుకోకపోవడం వల్లే దుకాణాదారులు నిబంధనలు పాటించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

జిల్లాడ్రగ్ఇన్‌స్పెక్టర్లు అప్పుడప్పుడుతనిఖీలు చేయడం, నామమాత్రంగా కేసులు నమోదుచేసి చేతులు దులుపుకోవడం పరిపాటిగా మారింది. నెలనెలా డ్రగ్ఇన్‌స్పెక్టర్లకు మామూలు ఇవ్వడం వల్లనే మెడికల్ షాపులపై చర్యలు తీసుకోవడంలేదని విమర్శ లున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మెడికల్‌షాపులపై ఎప్పటికప్పుడుతనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



- హుజూరాబాద్ డివిజన్‌లో మొత్తం మెడికల్ షాపులు- 120
- ప్రతిరోజు అయ్యే వ్యాపారం రూ.10వేల నుంచి రూ.1లక్ష

● ఒక కంపెనీకి బదులు మరో కంపెనీ మందులు..

డ్రగ్స్, నకిలీ మందుల విక్రయాలు సైతం జోరుగా సాగుతున్నాయి. డాక్టర్ రాసిన కంపెనీ ఔషధాలు లేకుంటే వాటికి బదులు వేరే కంపెనీ మందులను అంటగడుతున్నారు. ఏమన్నా అంటే సేమ్ ఫార్ములా.. కంపెనీ మాత్రమే వేరు.. ఇదికూడా దానిలాగే పనిచేస్తుందని చెబుతున్నారు.

● లైసెన్స్ ఒకరిది.. నిర్వహణ మరొకరిది..

హుజూరాబాద్ డివిజన్‌లో మందులషాపులు బినామీ వ్యక్తులే నిర్వహిస్తున్నారు. ప్రొఫెషనల్ ఫార్మసిస్టు ఆధ్వర్యంలో అవగాహన ఉన్న సిబ్బందితో మాత్రమే దుకాణాలను నిర్వహించాలి. చాలామంది తక్కువ వేతనంతో యువకులను పనిలో పెట్టుకుంటున్నారు. మెడికల్‌పై పరిజ్ఞానం లేని వ్యక్తులు షాపులను నడుపుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. డ్రగ్‌కంట్రోల్ అధికారులు, ఏడీలు మెడికల్ షాపుల నిర్వాహకులతో ఒప్పందాలు చేసుకొని నిబంధనలకు పాతరేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

45వసారి రక్తదానం

చొప్పదండి, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భూపాలపట్నం మాజీసర్పంచ్ మునిగాల సుధాకర్ గౌడ్ ఆదివారం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో గర్భిణికి రక్తదానం చేశారు. ఇది ఆయనకు 45వ సారి రక్తదానం చేయడం దీంతో ఆయనను పలువురు అభినందించారు.

శివలింగం, నంది విగ్రహాలు లభ్యం

చొప్పదండి, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేశాయిపేట గ్రామచెరువు దగ్గర ఆదివారం నంది, శివలింగం విగ్రహాలు లభ్యమయ్యాయి. విషయం తెలిసిన గ్రామస్థులు విగ్రహాల దగ్గర కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు.

సైనికుడికి ఘన స్వాగతం

తిమ్మాపూర్, మే 4 (ఆంధ్రజ్యోతి): అలుగునూర్ శివారు మానేరునగర్‌కాలనీకి చెందిన వకులా భరణిశ్రీధర్(46) భారతసైన్యంలో 26 సంవత్సరాల పాటు దేశసేవకు అంకితమై పదవీవిరమణ అనంతరం తిరిగి స్వగ్రామానికి ఆదివారం చేరుకున్నారు. ఆయనకు కుటుంబసభ్యులు, కాలనీ వాసులు, అభిమానులు ఘనంగా స్వాగతంపలికారు.

గుండిలో ముగిసిన చిల్డ్రన్ బైబిల్ క్లాసులు

రామడుగు, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండి ఇమ్మానియేల్ ఏజీచర్చిలో పాస్టర్ మచ్చ తిమోతి ఆధ్వర్యంలో మూడురోజులపాటు నిర్వహించిన ఉచిత చిల్డ్రన్‌బైబిల్‌క్లాసులు ఆదివారంతో ముగిశాయి. టీపీఏ జిల్లాఅధ్యక్షుడు ఎర్రామల్లేశం హాజరై సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.

మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం అండగా ఉంటుంది

- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

తిమ్మాపూర్, మే 4 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల సంక్షేమం, ముదిరాజుల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. ఆదివారం దిగువ మానేరుడ్యాం తీరప్రాంతానికి మార్నింగ్ వాక్‌కు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ వెళ్లారు. ఈ సందర్భంగా మత్స్యకారుల దినచర్య, చేపలవేట, అమ్మకాలు, కుటుంబ పరిస్థితులు వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.


మత్స్యకారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

ఘనంగా ధ్వజస్తంభం, విగ్రహ ప్రతిష్ఠాపన..

మండలంలోని పర్లపల్లిలోని శ్రీభవాని చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ధ్వజస్తంభం, విగ్రహప్రతిష్ఠాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు ఆయనను దీవించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠకు బండి సంజయ్‌కి ఆహ్వానం

హుజూరాబాద్, మే 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీసీతారామ చంద్రస్వామి దేవాలయంలో ఈనెల23న జరిగే ధ్వజస్తంభ ప్రతిష్ఠకు విచ్చేయాలని కేంద్రహోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్‌ను ఆలయచైర్మన్ చక్రధర్ ఆదివారం ఆహ్వానించారు. ఈ సందర్భంగా కరీంనగర్‌లోని ఆయన నివాసంలో మార్యదపూర్వకంగా కలిసిపుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనకు తప్పకుండా హాజరు కావాలని కోరారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

ఇల్లందకుంట, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచపల్లి గ్రామంలో గౌడకులస్థుల ఆధ్వర్యంలో నిర్మిస్తున్న రేణుక ఎల్లమ్మ దేవాలయ నిర్మాణానికి మాజీసర్పంచ్ బూస ఆదిలక్ష్మి రూ.50వేలు, చుంచు రాజీర్ రూ.30వేలు అదించారు. ఈ సందర్భంగా గౌడ కులస్థులు వారిని అభినందించారు.

కాంగ్రెస్ కార్యాలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే

జమ్మికుంట, మే 4 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంటలోని మండల యువజన కాంగ్రెస్ కార్యాలయాన్ని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లిసత్యం ఆదివారం సందర్శించారు. ఈసందర్భంగా మండల అధ్యక్షుడు బుడిగె శ్రీకాంత్ఎమ్మెల్యేనుఘనంగా సన్మానించారు.

మావోయిస్టులతో చర్చలు జరపాలి

జమ్మికుంట, మే 4 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం చర్చలు జరపాలని ఆలయ ఫౌండేషన్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ గుణసాగర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆపరేషన్ కగార్ పేరిట అడవినంతా పోలీస్ క్యాంపులతో నింపేశారని తెలిపారు.అడవిని వెన్నంటి కాపాడుతున్న అడవి బిడ్డల పోరాటానికి బాసటగా నిలవాలని కోరారు.

యాభై శాతం ఫీజు రాయితీ

జమ్మికుంట, మే 4 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లిలోగల సాహితీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గార్డియన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో విద్యార్థులకు యాభైశాతం ఫీజురాయితీ కల్పిస్తామని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మహమ్మద్ అంకూస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు.

ఘనంగా భగీరథ మహర్షి జయంతి

హుజూరాబాద్‌రూరల్, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనుకులగిద్ద గ్రామంలో సగరసంఘం ఆధ్వర్యంలో భగీరథ మహర్షిజయంతిని ఘనంగా నిర్వహించారు. భగీరథ మహర్షి చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కౌలు రైతు కుటుంబానికి గేదె అందజేత

జమ్మికుంట రూరల్, మే 4 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మండలం పాపక్కపల్లి గ్రామానికి చెందిన బొరాల రాజేందర్ అనే కౌలు రైతు అప్పుల బాధతో గతేడాది నవంబర్ 29న ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైతు స్వరాజ్యవేదిక నిర్వాహకులు రూరల్ డెవలప్మెంట్ సర్వీస్ సొసైటీకి సమాచారం అందించారు. ఆసంస్థ అందించిన రూ.40 వేల సహాయంతో వారు ఒకబర్రెను కొనుగోలుచేసి కౌలు రైతు కుటుంబానికి అందజేశారు.